క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఆరిలోవ : బీఆర్‌టీఎస్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురై ఒకరు మృతిచెందారు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పైనాపిల్ కాలనీకి చెందిన హరీష్, శ్రీకృష్ణాపురానికి చెందిన ముంజేటి జయంత్ స్నేహితులు. వీరిద్దరూ కలిసి శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సిగరెట్లు కోసం పైనాపిల్ కాలనీ నుంచి హనుమంతవాక వైపు బైక్‌పై వెళ్తున్నారు. మితిమీరిన వేగంతో బైక్‌పై వెళ్తూ అదుపు చేయలేకపోవడంతో రామకృష్ణాపురం వద్ద డివైడర్‌పైకి దూసుకుపోయి కిందపడ్డారు. దీంతో బైక్ నడుపుతున్న హరీష్‌కు, వెనుక కూర్చొన్న జయంత్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఆరిలోవ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలపాలైన ఇద్దరినీ కేజీహెచ్‌కు చికిత్స కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు జయంత్ మృతి చెందాడు. రెండో వ్యక్తి హరీష్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. హరీష్ కూడా అపస్మారక స్థితిలో ఉన్నట్లు తెలిసింది. దీనిపై జయంత్ తండ్రి రాము ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శంకర్ కేసు నమోదు చేశారు.

ఆరిలోవలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు



అవుట్ పోస్ట్‌లో హెడ్ కానిస్టేబుల్

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ : ఆరిలోవ పాత పోలీస్ స్టేషన్‌ను పోలీసులు శనివారం తెరిచారు. ఇక్కడి స్టేషన్‌ను పది నెలల క్రితం విమ్స్ ఆస్పత్రి ఆవరణలోని కొత్త భవనంలోకి తరలించారు. పాత పోలీస్ స్టేషన్ భవనం ఖాళీ చేసేశారు. అప్పటి నుంచి విశాలమైన ఈ ప్రాంతంలో పోలీసులు అందుబాటులో లేకపోవడంతో ఆరిలోవ కాలనీ, ఆఖరి బస్టాప్, దుర్గాబజార్, పాత పోలీస్ స్టేషన్, టి.ఐ.సి.పాయింట్, ముస్తఫాకాలనీ, బాలాజీనగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లో అల్లరి మూకల హడావిడి పెరిగిపోయింది. వీరు తరుచూ అల్లర్లకు దిగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీనిపై గత నెల 28న 'ఆరిలోవలో రెచ్చిపోతున్న అల్లరి మూకలు' శీర్షికతో సాక్షిలో ప్రచురించిన కథనానికి పోలీస్ అధికారులు స్పందించారు. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు పాత పోలీస్ స్టేషన్‌లో అవుట్ పోస్టు ప్రారంభించి ఓ హెడ్ కానిస్టేబుల్‌తోపాటు కానిస్టేబుళ్లను అందుబాటులో ఉంచారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఇక్కడ నిత్యం అందుబాటులో ఉండాలని కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

ఆరిలోవ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా ఆరిలోవ ప్రాంతం పన్నెండో వార్డుకు చెందిన చొక్కర శేఖర్‌ను శుక్రవారం నియమించారు. దీంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. పార్టీ బలోపేతానికి బాధ్యతతో కృషి చేస్తానని తెలిపారు. పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, గన్నమనేని వెంకటేశ్వరరావు(జీవీ)కు కృతజ్ఞతలు తెలిపారు.

"ట్రావెల్స్" పార్కింగ్‌తో పరేషాన్!



ప్రజల కోసం నిర్మించిన రోడ్డుపై దర్జాగా పార్కింగ్ చేసిన ట్రావెల్స్ బస్సులు

- ఆరిలోవ రోడ్లపై అనధికారికంగా పార్కింగ్
- స్థానికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- శ్రీకాంత్‌నగర్ డబుల్ రోడ్డుపై టీడీపీ నాయకుడితోపాటు మరికొందరి పెత్తనం
- బస్సులు నిలిపి... తీసే సమయంలో నిత్యం ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు, పోలీసులు

ఆరిలోవ : వాహనాల రాకపోకలకు సౌకర్యం కోసం రోడ్లు విస్తరిస్తుంటారు. ఇందుకోసం అధికారులు కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేస్తుంటారు. అయితే వాహనాల రాకపోకల కోసం విస్తరించిన ఆ రోడ్లను కొన్నిచోట్ల కొందరు అనధికారిక పార్కింగ్ కోసం ఉపయోగించుకుంటున్నారు. ఆరిలోవ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు వీలుగా కోట్ల రూపాయలు ఖర్చుచేసి జీవీఎంసీ అధికారులు విస్తరించిన రోడ్లు అనధికారిక పార్కింగ్ స్థలాలుగా మారిపోయాయి. అలా పార్కింగ్ చేస్తున్న వాహనాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి శ్రీకాంత్‌నగర్ రోడ్డు ట్రావెల్ బస్‌లకు పార్కింగ్ స్థలంగా మారిపోయింది. రోజూ పదుల సంఖ్యలో ట్రావెల్ బస్‌లను ఈ రోడ్డులో పార్కింగ్ చేస్తున్నారు. ఆరిలోవకు చెందిన ఓ టీడీపీ నాయకుడి ట్రావెల్ బస్సులతోపాటు మరికొన్ని యాజమాన్యాలకు సంబంధించిన ట్రావెల్ బస్సులు రోజూ నగరం నుంచి వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను తీసుకెళ్లి... తిరిగొచ్చిన తర్వాత ఖాళీ బస్సులను రాత్రివేళల్లో ఇక్కడకు తీసుకొచ్చి పార్కింగ్ చేస్తున్నారు. **అయితే ఆ బస్సులను తీసుకొచ్చి** పార్కింగ్ చేసేటప్పుడు, తిరిగి బయటకు తీసుకెళ్లేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి.

పార్కింగ్‌తో ఇరుకుగా డబుల్ రోడ్డు

శ్రీకాంత్‌నగర్‌లో గెడ్డను ఆనుకుని డబుల్ రోడ్డు ఉంది. ఆరిలోవ కాలనీ, ముడసర్లోవ ప్రాంతాల నుంచి వచ్చిపోయే వాహనాలతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ వరుసగా పదుల సంఖ్యలో నిలుపుతున్న ట్రావెల్ బస్సుల వల్ల రోడ్డు ఇరుకుగా మారడంతో వాహనచోదకులకు ఇబ్బంది కలుగుతోంది. తరుచూ ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు భయపడుతున్నారు. అర్ధరాత్రి సమయంలో పెద్ద హారన్లు కొడుతూ ఇక్కడకు బస్సులను తీసకొచ్చి నిలుపుతున్నారు. కొన్ని బస్సులను వేకువజామున తీస్తుండడంతో పెద్ద శబ్దాలకు నిద్ర పట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. ఇక్కడ ట్రావెల్ బస్సులు నిలవకుండా పోలీసులు, జీవీఎంసీ అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాలతో భయాందోళనలు

ఈ ఏడాది జనవరి 1న వేకువజామున (అర్ధరాత్రి దాటిన తర్వాత) వీఎల్ ట్రావెల్స్ బస్సు శ్రీకాంత్‌నగర్ డబుల్ రోడ్డులో నిలుపుతుండగా అదుపుతప్పి ఇక్కడి డివైడర్‌లో ఉన్న సిమెంట్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో ఆ స్తంభం విరిగిపోయి రెండు ముక్కలైంది. ఆ ప్రాంతంలో విద్యుత్ లైన్‌కు సంబంధించిన తీగలు మొత్తం తెగిపోయాయి. మరుసటి రోజు ఏపీ ట్రాన్స్‌కో విద్యుత్ విభాగం అధికారులు విరిగిన స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేశారు. తెగిపోయిన విద్యుత్ తీగలను పునరుద్ధరించారు. దానివల్ల ఒక రోజంతా ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా లేకుండాపోయింది. స్తంభాన్ని ఢీకొట్టిన బస్సు యజమానిపై ఆరిలోవ పోలీసులకు సబ్‌స్టేషన్ ఏఈ ఫిర్యాదు చేశారు. దీన్ని పునరుద్ధరించడానికి సుమారు రూ.50 వేలుకు పైగా ఖర్చు జరిగినట్లు విద్యుత్ శాఖకు అధికారులకు తెలిపారు.

- **ఏడాదిన్నర క్రితం ఓ రోజు ఉదయం ఓ ట్రావెల్స్ సంస్థకు చెందిన బస్సు డివైడర్‌పైకి దూసుకుపోయింది. దీంతో డివైడర్ గోడలు విరిగిపోయాయి.**
- **మూడేళ్ల క్రితం ఓ రోజు తెల్లవారుజామున ఇక్కడ నిలిపిన బస్సును నగరంలోకి** తీసుకెళ్లడానికి డ్రైవర్ మలుపు తిప్పాడు. ఆ సమయంలో రోడ్డు పక్కన నిద్రిస్తున్న ఓ వృద్ధురాలి మీదకు ఆ బస్సు వెనుక టైర్లు ఎక్కేశాయి. దీంతో ఆ వృద్ధురాలు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచింది. దీనిపై ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు ఆ వృద్ధురాలిని అనాథ శవంగా దహనకాండ జరిపించి కేసు నీరుగార్చేశారు. ట్రావెల్ బస్ యజమానికి పుష్కలంగా సహాయ సహకారాలు అందించారు.



పార్వతీనగర్ గెడ్డ పక్కన రోడ్డులో నిలిపిన ట్రావెల్స్ బస్సులు



శ్రీకాంత్‌నగర్‌లో వీఎల్ ట్రావెల్స్ బస్సు ఢీకొని విరిగిన విద్యుత్ స్తంభం

రూ.2.35 కోట్లతో విస్తరిస్తే... కార్ల పార్కింగ్

బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజానగర్ వరకు 2023లో జీవీఎంసీ రోడ్డు విస్తరించారు. సుమారు రూ.2.35 కోట్ల ఎంపీ నిధులతో అప్పటి నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సూచనలతో జీవీఎంసీ అధికారులు 20 అడుగుల రోడ్డును 60 అడుగులకు విస్తరించి డబుల్ రోడ్డుగా మార్చారు. విస్తరించిన ఆ రోడ్డు ఇప్పుడు కార్ల పార్కింగ్ స్థలంగా మారిపోయింది. వేర్వేరు ప్రాంతాల నుంచి ఇక్కడకు కార్లు తీసుకొచ్చి నిలిపేస్తున్నారు. **ఖాళీ స్థలాల్లో నిలుపుకోవాల్సిన** వాహనాలను రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా రోడ్లపై నిలిపేయడంతో ఇబ్బంది పడుతున్నామని వాహనచోదకులు ఆవేదన చెందుతున్నారు. కోట్ల రూపాయల ప్రజా ధనం వినియోగించి విస్తరించిన రోడ్లను కొందరు కార్లు, బస్‌లు నిలుపుకోవడానికి వినియోగించుకొంటున్నా జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని **కోరుతున్నారు.**



చినగదిలి సాయిబాబా గుడి, సూర్యతేజానగర్ మధ్య రోడ్డులో నిలిపిన కార్లు

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై ఆర్థిక భారం



ఆరిలోవలో ఏఈ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఐక్య సంఘాల నాయకులు



కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ఆరిలోవ : అదానీ విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు అమర్చడాన్ని వెంటనే నిలిపేయాలని వామపక్ష ఐక్య వేదిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఆరిలోవ విద్యుత్ సరఫరా ఏఈ కార్యాలయం ముందు ఐక్య సంఘాల నాయకులు శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహ్మాన్ మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు గృహ వినియోగానికి బిగిస్తే ప్రజలపై మరింత ఆర్థిక భారం పడుతుందన్నారు. ఇప్పటికే ప్రతి నెలా కరెంట్ రీడింగ్ తీసుకునే మీటర్లుండగా స్మార్ట్ మీటర్లు బిగించాల్సిన అవసరం ఏముందని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత ప్రభుత్వం అదానీతో ఒప్పందం కుదుర్చుకొందని..., స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలుగొట్టండని ప్రస్తుత మంత్రి లోకేష్ ప్రగల్భాలు పలికారని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లను బిగించేస్తుంటే మంత్రి హోదాలో ఉన్న లోకేష్ నోరు మెదపడంలేదన్నారు. దీనివల్ల ప్రజలకు ఆర్థికంగా నష్టం కలుగుతుందన్నారు. స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని, లేదంటే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఎన్నికల ముందు ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచబోమని మాయ మాటలు చెప్పిన చంద్రబాబునాయుడు అధికారం చేపట్టిన తర్వాత ట్రూఅప్ చార్జీల పేరుతో పలుసార్లు పెంచారన్నారు. దీనిపై ఈ నెల 5న ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం ఏఈ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం, సీపీఐ, ఐద్వా, ఏఐఎఫ్‌బి, ప్రజా నాట్యమండలి నాయకులు నరేంద్ర కుమార్, శంకరరావు, లక్ష్మణరావు, దేవుడమ్మ, రత్నం, కాంతం, చిరంజీవి, సందీప్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజలపై భారం

టీచ్‌రోడ్డు : రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిలోనే ప్రజలపై మరింత విద్యుత్ భారాలు మోపారని సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కమిటీ కార్యదర్శి పి.వెంకటరావు విమర్శించారు. పెదవాల్తేరు పోలమాంబ ఆలయ సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.15,485 కోట్లు ప్రజలపై భారం మోపారని... పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. అదానీ స్మార్ట్ మీటర్లు గృహ వినియోగదారులపై ఆర్థిక భారం మోపడానికి బిగించడం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని ఎన్నికల ముందు లోకేష్, చంద్రబాబు, పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారని... అధికారంలోకి వచ్చాక అదే అదానీ స్మార్ట్ మీటర్లు ఎలా బిగిస్తున్నారని ప్రశ్నించారు. సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, కె.కుమారి, వై.కృష్ణ, జీవీఎస్ చలపతి, పీతల అప్పారావు, అనపర్తి అప్పారావు పాల్గొన్నారు.

కొట్లాట కేసు నమోదు

ఆరిలోవ : ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధి గొల్లల ఎండాడలో ఓ వ్యక్తిపై మరో ముగ్గురు వ్యక్తులు కొట్లాటకు దిగారు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ ఎనిమిదో వార్డు పరిధి గొల్లల ఎండాడలో గురువారం రాత్రి స్కూటీపై వెళ్తున్న దేవకీ ఆనంద్‌కు, అదే సమయంలో జీపులో వెళ్తున్న ముగ్గురు వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో ఆనంద్‌ను జీపులో ఉన్న శ్రావణ్, నరేష్‌తోపాటు మరో వ్యక్తి కొట్టి గాయపరిచారు. ఆనంద్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శ్రావణ్, నరేష్‌తోపాటు మూడో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించారు

- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



పదకొండో వార్డులో చంద్రబాబు మోసాలు వివరిస్తున్న మాజీ మేయర్ హరి వెంకటకుమారి



తొమ్మిదో వార్డులో మహిళకు కరపత్రం అందిస్తున్న సమన్వయకర్త మొల్లి అప్పారావు, కార్పొరేటర్ స్వాతి

ఆరిలోవ : సాధారణ ఎన్నికల్లో కూటమి నాయకులు ప్రజలను అబద్ధపు హామీలతో మోసం చేశారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్ పరిధి ఇందిరాప్రియదర్శిని కాలనీలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్పొరేటర్ కోరుకొండ వెంకటరత్న స్వాతి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులతో కలిసి అప్పారావు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలు తెలియజేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా నెరవేర్చేశామని అబద్ధాలాడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలపై వైఎస్సార్ సీపీ ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. సంవత్సరానికి మూడు గ్యాస్ సిలండర్లు అందరికీ ఇస్తామని చెప్పి ఒక్కొక్కటి చొప్పున కొందరికి మాత్రమే ఇచ్చారన్నారు. ఉచిత బస్ ప్రయాణం అదిగో ఇదిగో అంటూ గాలిలో ఊగిసలాడిస్తున్నారని ఆరోపించారు. వార్డు అధ్యక్షుడు నీరజ్‌కుమార్, జిల్లా కార్యదర్శి దాస్, వార్డు పరిశీలకుడు రవికిరణ్, స్థానిక నాయకులు సత్యవాణి, కనకరెడ్డి, భాస్కర్, కొండమ్మ, పిట్టా రెడ్డి, తారక్, చిన్నప్పారావు, రాజు, నూకరాజు, ఎల్లయ్య పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం విఫలం

జీవీఎంసీ పదకొండో వార్డు పరిధి టి.ఐ.సి.పాయింట్ వద్ద నగర మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ స్థానిక నాయకులతో కలిసి శనివారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలు వివరించారు. వైఎస్సార్‌సీపీ ముద్రించిన కరపత్రాలు ప్రజలకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపిందన్నారు. గతంలో స్మార్ట్ మీటర్లు వద్దంటూ చెప్పిన కూటమి నాయకులు అధికారం చేపట్టిన తర్వాత ఆ మీటర్లను అమర్చి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. జీవీఎంసీ వార్డుల్లో కనీసం నీరు కూడా సక్రమంగా సరఫరా చేయించలేకపోతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు ముగడ రమేష్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు మక్బుల్, నాయకులు పీతల అప్పలరాము, జహింగీర్, ఎ.అప్పలరాజు, కె.మోహనరావు, నాగు, షకీనా, గౌస్, పద్మ పాల్గొన్నారు.

- జీవీఎంసీ పన్నెండో వార్డులో శనివారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధి రాజీవ్‌నగర్‌లో నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని స్థానిక నాయకులతో కలిసి ప్రజలకు కరపత్రాలు అందజేశారు. కూటమి ప్రభుత్వ మోసాలు తెలియజేశారు. హామీలు నెరవేర్చకుండా మోసం చేసిన కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.శిరీష, స్థానిక నాయకులు మొల్లి హేమంత్, సుజాత, మౌళి, మోహన్, అర్జున్, రమేష్, లక్ష్మి, రాజులమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పథకాలు అందించాం

టీచ్‌రోడ్డు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలు, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముమ్మల సురేష్ అన్నారు. జీవీఎంసీ 20వ వార్డులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలను విడగొట్టి సంక్షేమ పథకాలు ఇవ్వకుండా మోసం చేస్తోందన్నారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్నప్పటికీ మేనిఫెస్టోలో చెప్పిన హామీలను అమలు చేయకుండా విస్మరించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 20వ వార్డు అధ్యక్షుడు యనమరెడ్డి కుమార్ రెడ్డి, తూర్పు నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కాగితాల రవికిరణ్ రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు తరుణ్ రెడ్డి, ఆర్టీఏ విభాగ అధ్యక్షుడు మద్ది రమణారెడ్డి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కాగితాల రమణారెడ్డి, 134వ నంబరు బూత్ అధ్యక్షుడు కంబాపు అప్పలరాజు, సీనియర్ నాయకులు యనమరెడ్డి రమణారెడ్డి, మద్ది పోలిరెడ్డి, ఎంపాడ వెంకటరమణ, రౌతుల వాసు, కాగితాల రామిరెడ్డి, కాగితాల మహేష్, సావాడ శేఖర్, కాగితాల అప్పలరెడ్డి, కాగితాల శేషు, కాగితాల గోపి, సప్పిడి వెంకటరావు, పిల్లి శివ, సారిపిల్లి సోమేష్, పిలక శ్రీనివాసరెడ్డి, రవణమ్మ, మారడ ఎల్లమ్మ, శంకరమ్మ, యువత రెడ్డి, ఈగల సత్యవతి, పద్మ పాల్గొన్నారు.



కరపత్రం అందిస్తున్న ముమ్మల సురేష్

కూటమి ప్రభుత్వంలో ప్రజలపై విద్యుత్ చార్జీల భారం



16వ వార్డులో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న మొల్లి అప్పారావు



22వ వార్డులో కరపత్రం అందిస్తున్న పీతల గోవింద్, నాయకులు

మద్దిలపాలెం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచేదిలేదని చెప్పి... అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు వివిధ పద్ధతుల్లో పెంచి ప్రజలను వంచిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. 16వ వార్డు ఇసుకతోట, రజకవీధిలోని 267వ బూత్ పరిధిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం కార్పొరేటర్ మొల్లి లక్ష్మి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు అమర్చి ప్రజలపై భారం మోపుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం గద్దె దిగే వరకు పోరాడాలన్నారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలు వివరిస్తూ కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, బూత్ అధ్యక్షుడు వేములవలస అప్పారావు, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు నగిరెడ్ల పోలిశెట్టి, మహిళ విభాగం అధ్యక్షురాలు ఒమ్మి పోలరత్నం, జిల్లా బీసీ విభాగం కార్యదర్శి బొట్ట శివ, యూత్ అధ్యక్షుడు కొంగరాని రాంబాబు, మీసాల ప్రదీప్, గొలగాని కన్నారావు, సుబ్రహ్మణ్యం రెడ్డి, ఫిరోజ్, సతీష్, డొక్కర రాజు, జగదీశ్వరి, సంధ్య, పార్వతి, వేణుగోపాల రెడ్డి, వెంకటరమణ, కిషోర్, బాల, అచ్చి కోటి, సూర్యారావు, మెట్ట సూర్యనారాయణ, నరవ రాజు, నారాయణ, సచిన్, వి.శ్రీను, ఈశ్వరరావు, వి.వెంకట్, ఆనాపు సత్యనారాయణ, పోతురాజు, మంగాదేవి, తులసి, విజయ, రమణ, అబ్బాస్, దేవుడు, అరుణ్, ఉపేంద్ర, కార్తీక్, శ్యామ్, హేమంత్, తిరుపతి పాల్గొన్నారు.

- జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెం పరిధి బూత్ నంబర్ 144లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గడప గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను పొందుపరిచిన కరపత్రాలను అందించారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన మోసాలు, అరాచకాలు వివరించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు దువ్వి గోవింద్, పీతల మహేష్, రాజు, లక్ష్మి, చంద్రరావు, శ్యామ్, గోవిందమ్మ పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం



తల్లిపాల విశిష్టతను తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దృశ్యం



నెహ్రూనగర్‌లో తల్లి పాల వారోత్సవాల ర్యాలీ

ఎంవీపీ కాలనీ : తల్లిపాల వారోత్సవాలపై ఐసీడీఎస్, వాసవ్య మహిళ మండలి, విప్రో కేర్ కుశాల్ మెటర్నిటీ మెంటల్ హెల్త్ ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పెదజాలరిపేటలో అవగాహన కల్పించారు. ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ఆరోగ్యంతోపాటు సంపూర్ణ పోషకాలను, విటమిన్స్, మినరల్స్, ప్రోటీన్స్ అందిస్తాయన్నారు. తల్లి పాలు తగిన విద్యార్థులు అవసరమైన బరువు ఉండటంతోపాటు అనారోగ్యం బారినపడకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, వాసవ్య మహిళ మండలి, విప్రో కేర్ కుశాల్ మెటర్నిటీ మెంటల్ హెల్త్ ప్రాజెక్టు సంస్థల ప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆరిలోవ : జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి నెహ్రూనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తలు శనివారం తల్లి పాల వారోత్సవాలపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా నెహ్రూనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల ప్రాధాన్యత, వాటివల్ల పిల్లలకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలు వివరించారు.